# సుధీర్‌కుమార్‌కు 30వేల మెజార్టీ ఖాయం

## ఎన్ని కుట్రలు చేసినా గెలిచేది బీఆర్‌ఎస్సే



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన దాస్యం వినయ్‌భాస్కర్, అభ్యర్థి సుధీర్‌కుమార్

- విభజన హామీలు నెరవేర్చని బీజేపీకి ఓటెందుకు వేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి భయం
- హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ, మే 11 : బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ 30వేల పైచిలుకు మెజార్టీతో గెలవడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తంచేశారు. శనివారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మోస పూరిత హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి, మళ్లీ ఆగస్టు 15వ తేదీ వరకు గడువు పెట్టి మరోసారి రైతులను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఏ దవాఖానలో ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదని, కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వలేదని చెప్పారు. ధైర్యం ఉంటే కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అరూరి అవినీతిపరుడు, భూ కబ్జాకోరు అని విభజన చట్టంలో ఒక్క హామీనీ అమలుచేయని బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని ఎర్రబెల్లి ప్రశ్నించారు.

**అవినీతి, అణచివేతకు బ్రాండ్ కడియం..**
**బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్**

అవినీతికి, అణచివేతకు బ్రాండ్ కడియం శ్రీహరి అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య పోటీ ఉందన్నారు. కడియం మాదిగ జాతిని అడ్డుపెట్టుకుని పదవులు పొంది అదే జాతిని అణగదొక్కాడన్నారు. అరూరి, కడియం గురుశిష్యులని, వీరు చీకటి ఒప్పందం కుదుర్చుకుని ప్రజల ముందుకు వస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఒప్పందం చేసుకొంటే ఈటలను ఓడించింది ఎవరని ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పుచేతల్లో నడుస్తున్న చోటేభాయ్ రేవంత్‌రెడ్డి, బడేభాయ్ మోదీ బీఆర్‌ఎస్‌పై, కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శ్రీహరికి ఈ ఎన్నికలతో రాజకీయ సమాధి తప్పదన్నారు.

**ద్రోహులకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం**
**ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్**

వరంగల్‌లో ఓటమి భయంతోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వరంగల్‌లో పర్యటించారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్, కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్‌గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి రోడ్‌షోలో మాట్లాడుతున్న అభ్యర్థి సుధీర్‌కుమార్, పక్కన ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తిలో రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు

# తెలంగాణ గొంతుక బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టండి

- కాంగ్రెస్, బీజేపీలు మోసకారి పార్టీలు
- హామీల అమలులో రేవంత్‌రెడ్డి సర్కారు విఫలం
- పాలకుర్తి రోడ్‌షోలో మాజీ మంత్రి ఎర్రబెల్లి

## కారు గుర్తుకు ఓటేసి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి

## ద్రోహులను నమ్మి మోసపోవద్దు

పాలకుర్తి రూరల్, మే 11: ప్రజల గొంతుక బీఆర్‌ఎస్ పార్టీయేనని, ఢిల్లీలో తెలంగాణ వాణి వినిపించేందుకు కారు గుర్తుకు ఓటు వేసి వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి కాంగ్రెస్, బీజేపీలను బొంద పెట్టాలన్నారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం జనగామ జిల్లా పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో రోడ్‌షోలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి ఎర్రబెల్లి హాజరయ్యారు. రోడ్‌షోకు పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పాలకుర్తి జనసంద్రమైంది. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజల బతుకులు ఆగమయ్యాన్నారు. ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. హామీలు అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. కారు గుర్తుపై గెలిచి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, బీజేపీలో చేరిన అరూరి రమేశ్ దొంగలని మండిపడ్డారు. కడియం శ్రీహరికి రాజకీయ భిక్ష పెట్టింది తానేనని ఎర్రబెల్లి గుర్తుచేశారు. కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసి నాలుగు సార్లు ఓడిపోయాడని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని, గోదావరి జలాలతో చెరువులు నింపానన్నారు. మిషన్‌భగీరథతో ఇంటింటికీ నల్లానీరు ఇచ్చామని, గ్రామాల్లో సీసీరోడ్లు వేశానన్నారు. నియోజకవర్గంలో దేవాలయాలను నిర్మించానని, రహదారులు వేశానన్నారు. తండాలను జీపీలుగా మార్చానని చెప్పారు. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడే తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. ఇన్ని చేసిన తనను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టారని మాజీ ఎర్రబెల్లి ఒక్కసారిగా భావోద్వేగానికి గురి కావడంతో మహిళలు కంట తడిపెట్టారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. పాలకుర్తి గడ్డ దయన్న అడ్డా అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పాలకుర్తి నుంచే విజయం సాధిస్తానన్నారు. పాలకుర్తిలో 20వేల మెజార్టీ బీఆర్‌ఎస్‌కు ఖాయమన్నారు.

**తెలంగాణ ద్రోహులను పాతరేయాలి : సిరికొండ**

కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ఇద్దరూ తెలంగాణ ద్రోహులని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఓటుతో కడియం శ్రీహరిని రాజకీయంగా సమాధి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు.

**కడియం శ్రీహరి కాదు..**
**కన్నింగ్ శ్రీహరి : ఏనుగుల రాకేశ్‌రెడ్డి**

కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి.. ఓ కన్నింగ్ శ్రీహరి అని బీఆర్‌ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్‌కు మోసంచేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొట్టిందని మండిపడ్డారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు భర్తీ చేసిన ఉద్యోగాలే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క ఉద్యోగానికి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజల బతుకులు ఆగమయ్యాయన్నారు. వరంగల్ ఎంపీగా సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

### ఎవరొచ్చినా గెలుపు నాదే : సుధీర్‌కుమార్, వరంగల్ అభ్యర్థి

ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రచారం చేసినా వరంగల్ ఎంపీగా గెలుపు నాదే. పార్టీలు మారే వారికి వరంగల్ ప్రజలే బుద్ధి చెబుతారు. దమ్ముంటే కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలి. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులు, కారు గుర్తుకు ఓటు వేసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలి.


